క్లుప్తంగా

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెంచికల్‌పేట్: ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపునకు కృషి చేయాలని పార్టీ నాయకులు బుధవారం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు చౌదరి తిరుపతి, సముద్రాల రాజన్న, మాజీ సర్పంచ్‌లు జాజిమొగ్గ శ్రీనివాస్, ఉపాసీ సంజీవ్, ఆత్రం సాయుధ, నాయకులు బండన్న, సాజీద్, ఖైరాత్, భాస్కర్, బోయిరె బండు, తెలంగాణ జావీద్, చలం, లచ్చన్న పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ పల్లకి ఊరేగింపు


లింగాపూర్: పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు కొత్తపల్లి, పిక్లాతండా, దంపూర్, రాముునాయక్‌తండా, గోపాల్‌పూర్, వంకామద్ది, మొతిపటార్‌తో పాటు తదితర గ్రామాలలో ఘనంగా సేవాలాల్ మహరాజ్ పల్లకిని ఊరేగించారు. ఈసందర్భంగా సేవాలాల్ దీక్షను జగదాంబ మందిరంలో బుధవారం విరమించారు.

రేపు ఆదివాసీల సమావేశం

బెజ్జూర్: మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఈనెల 19న ఆదివాసీల సమస్యలపై సమావేశం నిర్వహించనున్నట్లు ఆదివాసీ సంఘం జిల్లా నాయకుడు సోయం చిన్నయ్య, మండల నాయకులు మెస్రం రాజారామ్, ఎలాది నారాయణలు తెలిపారు. గోండ్వాన గోండు మహాసభ జాతీయ నాయకులు సిడం అర్జున్ మాస్టర్, గోండ్వానా రాయి సెంటర్ చర్చ గోస్ట్ జిల్లా నాయకులు మోతి రాములు సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం జరిగే చర్చా వేదికకు మండలంలోని ఆదివాసీ నాయకులు, గ్రామ పెద్దలు, ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో జిల్లా నాయకులు


పూజలు చేస్తున్న జిల్లా బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: మహారాష్ట్రలోని చంద్రపూర్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుధీర్ మునిగంటివార్ ఎన్నికల ప్రచారంలో జిల్లా నాయకులు బుధవారం పాల్గొన్నారు. చంద్రపూర్‌లోని మహాంకాళి మందిరంలో సుధీర్ గెలుపుకోసం ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు సతీశ్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, జిల్లా నాయకులు సునీల్ చౌదరి, సంజీవ్, ఓదెలు, సూర్యప్రకాశ్, శ్రీనివాస్, మున్న, రవి, రాజూరా తాలుకాలోని దేవాడా, సోండా బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన 'అరిగెల' సోదరులు


బీజేపీలో చేరుతున్న నాగేశ్వర్, తదితరులు

ఆసిఫాబాద్: బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఆయన సోదరుడు ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, వారి అనుచరులు మంగళవారం రాత్రి బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎన్నికల విధులతో నష్టం జరగకుండా చూడాలి

రెబ్బెన: సంస్థ ఆదేశాలతో ఎన్నికల విధులకు హాజరయ్యే సెక్యూరిటీ సిబ్బందికి ఉద్యోగపరమైన, ఆర్థికపరమైన నష్టం జరగకుండా చూడాలని బెల్లంపల్లి ఏరియాలో విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది కోరారు. బుధవారం ఏరియా పర్సనల్ మేనేజర్ తిరుపతికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించే రోజును స్పెషల్ లీవుగా పరిగణించకపోవడంతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సెక్యూరిటీ సిబ్బందికి ఆన్ డ్యూటీలుగా పరిగణలోకి తీసుకొని టీఏ, డీఏలు వర్తింపజేయాలని కోరారు.


దహెగాం: కల్యాణ మహోత్సవానికి హాజరైన ప్రజలు


కెరమెరి: మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు


పెంచికల్‌పేట్: ఎల్కపల్లి రామాలయంలో..

వైభవంగా వివాహ మహోత్సవం


తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకొస్తున్న గోలేటి ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌గౌడ్ దంపతులు


జైనూర్‌లో..

జిల్లాలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల వివాహ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా జరుపుకున్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో రాములవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి రామాలయం, చేద్వాయి హనుమాన్ ఆలయం, దహెగాం మండల కేంద్రంతో పాటు మండలంలోని హత్తిని, లగ్గాం, చినరాస్పెల్లి, కుంచవెల్లి గ్రామాల్లోని ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. దహెగాం మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో నిర్వహించిన మహోత్సవానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హాజరయ్యారు. కెరమెరి మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయం, దౌనల్ ప్రాంతంలోని శ్రీలక్ష్మీ నారాయణ మండపం, చింతలమానెపల్లి మండలంలోని ఖర్జెల్లి ఓంకార ఆశ్రమం, మండల కేంద్రంలోని ఆంజనేయ ఆలయం, దబ్బా హనుమాన్ ఆలయం, రుద్రాపూర్ హనుమాన్ ఆలయం, దిందా అభయాంజనేయ ఆలయాలు ఉత్సవాల సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాగజ్‌నగర్ మండలంలోని ఆయా ఆలయాల్లో నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఇన్‌చార్జి జెడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. రెబ్బెన మండలం నవేగాం శివకేశవ ఆలయం, రెబ్బెనలోని సీతారామాంజనేయ ఆలయం, గోలేటి టౌన్‌షిప్‌లోని శ్రీ కోదండ రామాలయం, తక్కళ్లపల్లి, నంబాల గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సీతారామాంజనేయ స్వామి ఆలయ ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర చేపట్టారు. బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు ఎలుకపెల్లి, చిన్న సిద్దాపూర్, పలు గ్రామాల్లో, కౌటాల, జైనూర్, వాంకిడి, లింగాపూర్ మండలాల్లోని గ్రామాల్లో వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు.


వాంకిడి: సీతారాముల కల్యాణంలో పాల్గొన్న జెడ్పీటీసీ దంపతులు


రెబ్బెనలో అక్షింతలు వేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు


దహెగాం: మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు


ఆసిఫాబాద్‌అర్బన్: నవేగాం శివకేశవ ఆలయంలో..


కెరమెరి: సీతమ్మ పల్లకి ఊరేగింపు..


చింతలమానెపల్లి: ఓంకార ఆశ్రమంలో హాజరైన భక్తులు


చింతలమానెపల్లి: ఖర్జెల్లిలో సీతారాముల కల్యాణం


సిర్పూర్(టి): కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న పండితులు


కాగజ్‌నగర్‌రూరల్: పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప


పూజలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి జెడ్పీచైర్మన్ కృష్ణారావు దంపతులు


కౌటాల: శ్రీ కోదండ రామాలయంలో..


కౌటాల: తాటిపల్లి హనుమాన్ ఆలయంలో..


జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మిని సన్మానిస్తున్న అర్చకులు


ఆలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్


లింగాపూర్‌లో..


ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శోభాయాత్ర


బెజ్జూర్: శ్రీరాముని కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు


గోలేటిలో హాజరైన హనుమాన్ భక్తులు

నీటి తొట్లు.. నిర్వహణ కరువు

- నిరుపయోగంగా మారిన నీటితొట్లు
- పశువులకు దప్పిక కష్టాలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

లింగాపూర్: వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం గతంలో ఉపాధిహామీ పథకం కింద నీటి తొట్లు నిర్మించింది. గ్రామాలలో నీటి సౌకర్యం ఉన్న ట్యాంకులు, పబ్లిక్ కొలాయిల వద్ద వీటిని నిర్మించారు. కానీ సంబంధిత అధికారులు నీటి తొట్ల నిర్వహణ గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. చాలా గ్రామాల్లో నీటి తొట్లు శిథిలావస్థకు చేరాయి. వాటి నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడంతో కొన్నేళ్లకే చాలా వరకు దెబ్బతిన్నాయి. దీంతో పశుపోషకులు మూగజీవాల దాహార్తి తీర్చేందుకు తిప్పలు పడుతున్నారు. నీటి తొట్ల నిర్వహణ చేపట్టాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఇలా..

మండలంలోని 14 గ్రామపంచాయతీల పరిధిలో 42కు పైగా గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో మొత్తంగా 20కి పైగా పశువుల నీటి తొట్లు నిర్మించారు. కానీ కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరాయి. కొన్ని గ్రామాల్లోని నీటి తొట్లు నీరు నింపక నిరుపయోగంగా మారాయని అలాంటి వాటిని గుర్తించి వెంటనే నీరు నింపి వినియోగం లోకి తీసుకురావాలని మండలవాసులు కోరుతున్నారు. పశువులకు నీటి సౌకర్యం లేక రైతులు మూగజీవాలను విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని శిథిలావస్థకు చేరిన నీటి తొట్టిల స్థానంలో కొత్త తొట్లు నిర్మించాలని, అవసరమైన నీటి తొట్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


నిరుపయోగంగా మారిన పశువుల నీటి తొట్టె

మురుగు నీటిని తాగిస్తున్నాం



గ్రామంలో నిర్మించిన పశువుల నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. దీంతో పశువులను గ్రామానికి దూరంగా ఉన్న మురుగు కాలువ వద్దకు తీసుకెళ్లి నీటిని తాగిస్తున్నాం. ఎండలు తీవ్రమైతే నీటి కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– జాదవ్ అర్జున్, లింగాపూర్

నీటి తొట్లు నిర్మించాలి



వేసవికాలం దృష్టిలో పెట్టుకొని మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధిహామీ పథకం ద్వారా పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలు నిర్మించాలి. నీటి సౌకర్యం లేక పశువులను విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఆడే జితేందర్, లింగాపూర్

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

జైనూర్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సీఐ అంజయ్య అన్నారు. బుధవారం జైనూర్ పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలు పండించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌరి కొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంరావు తన చేనులో గంజాయిని సాగు చేసి అమ్ముతున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై సందీప్‌కుమార్ తనిఖీలు చేపట్టి పంచనామా నిర్వహించారు. భీంరావును రిమాండ్‌కు తరలించారు.

భగ్గుమంటున్న ఎండలు

కౌటాల: జిల్లాలో ఎండలు భగ్గుమంటున్నాయి. బుధవారం జిల్లాలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కౌటాల, కాగజ్‌నగర్‌లో అత్యధికంగా 44.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు మండుతుండడంతో లింగాపూర్ మినహా జిల్లాలోని 14 మండలాలు అలెర్ట్ జోన్‌లో ఉన్నాయి. గతేడాది కంటే ఈసారి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. జిల్లాలోని జంబుగా, వంకులం, బెజ్జూర్‌లలో సైతం గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఏప్రిల్ చివరి వారం, మేలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువ ఉంటా యని అధికారులు చెబుతున్నారు. ఎండ వేడిమికి ప్రజలతో పాటు వాహనదారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.